ప్రజాశక్తి
సోమవారం 4 సెప్టెంబర్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



బాపట్ల జిల్లా పర్చూరు ప్రాంతంలో పొల్లాలోకి చేరిన వర్షపు నీరు

ఊరిస్తున్న వర్షం..

- అన్నదాతల హర్షం
- పంటలకు మేలు

అంటున్న అధికారులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రస్తుతం కురుస్తున్న వర్షం రైతన్నలను ఊరిస్తుంది. ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా వర్షం కురియలేదు. గత మూడు నెలల కాలంలో లోటు వర్షపాతం నమోదైంది. ఈనెల మొదటిలోనే జిల్లా వ్యాప్తంగా వర్షం పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించటంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటీ నుంచి ఇప్పుడే వర్షం కురుస్తుంది. జూన్, జులై, ఆగస్టు నెలలో ఎప్పుడూ లేనివిధంగా లోటు వర్షపాతం నమోదైంది. 25 నుంచి 57.9 శాతం లోటు వర్షపాతం నమోదు కావటం ఇందుకు నిదర్శనం. ఖరీఫ్‌లో పంటలు వేసిన రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షం కురుస్తుంది. జిల్లాలో ఆదివారం 48.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గిద్దలూరులో అత్యధికంగా 14.9 సెంటీమీటర్ల నమోదైంది. మరో రెండు రోజులు వర్షం కొనసాగుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలకు ఈ వర్షం ఊతమిచ్చినట్లు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 48.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లాలో 48.9 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. గిద్దలూరులో అత్యధికంగా 14.9 సెంటీమీటర్లు నమోదైంది. చీమకుర్తిలో 92.8 మిల్లీమీటర్లు, పొన్నలూరులో 92.4, మద్దిపాడులో 91.2, సంతనూతలపాడు 86.6, కొండపిలో 80.4, శింగరాయకొండలో 78.4, దర్శిలో 77.2, తాళ్ళూరులో 75.2, కొమరోలులో 74.6, మర్రిపూడిలో 73.9, హెచ్‌ఎంపాడులో 68.4, ఒంగోలులో 63.8, రాచర్లలో 63.4, పుల్లలచెరువులో 58.4, కనిగిరిలో 53.6, జరుగుమల్లిలో ▶ 2లో

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం
గాలిలో కలిసిన ఐదుగురి ప్రాణాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- రాగ్ రూట్‌లో ఆటోను ఢీకొన్న లారీ
- సంతమాగులూరు వద్ద ఘటన
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన

ఎస్‌పి వకుల్ జిందాల్



పాల్యా నారీనాయక్

ప్రజాశక్తి-సంతమాగులూరు

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పొట్టకూటి కోసం వచ్చిన ఐదుగురి ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బాపట్ల జిల్లా సంతమాగులూరులో ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గుంటూరు హౌసింగ్ బోర్డు ఆదర్శనగర్ మూడో లైన్‌కు చెందిన చెలిమెళ్ళ కవిత (19), గుంటూరు నల్లచెరువు ఒకటవ లైన్‌కు చెందిన అలివేలు మంగతాయారు (19), గుంటూరుకు చెందిన పాల్యా నారీనాయక్ (19), గుంటూరు నల్లచెరువు మూడోలైన్‌కు చెందిన తమ్మిశెట్టి తులసి (16), గుంటూరు గోరంట్లకు చెందిన బుర్రి మాధవి (35) మృతిచెందారు. గుంటూరు శ్రీనివాస పేట ఒకటవలైన్‌కు చెందిన సలికునేడి విజేత, గుంటూరు నల్లచెరువు వర్కర్స్ కాలనీకి చెందిన పాల్యా రాజు నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... గుంటూరుకు చెందిన ఏడుగురు ప్రకాశం జిల్లా మార్కాపురంలో శనివారం రాత్రి నిర్వహించిన వివాహ వేడుకల్లో ఈవెంట్ నిర్వహించి ఆటోలో గుంటూరుకు బయలు దేరారు. ఘటనా స్థలం సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ అక్కడ నున్న ప్రమాద హెచ్చరిక బోర్డును తప్పించే క్రమంలో రాంగ్ రూట్ వెళ్లి ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న అలివేలు మంగతా యారు, తమ్మిశెట్టి తులసి, పాల్యా నారీనాయక్ (19) అక్కడిక్కడే మృతిచెందారు. మిలిగిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షత గాత్రులను 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో చెలిమెళ్ళ కవిత, బుర్రి మాధవి మృతి చెందారు. సలికునేడి విజేత, పాల్యా రాజు నాయక్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఎస్‌పి వకుల్ జిందాల్, డిఎస్‌పి వెంకటేశులు, ఎస్ఐ శివకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడం పట్ల ఆయన దిగ్భాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.



అలివేలు మంగ తాయారు



బుర్రి మాధవి



చెవిమెళ్ల కవిత



తమ్మిశెట్టి తులసి

'కరణం' వాఖ్యలతో రాజకీయ కాక

- వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా

బయటపడిన గ్రూపుల పోరు

- బాలినేని నివాసంలో మంత్రి మేరుగ,

కరణం వెంకటేష్ బేటీ



వైఎస్ఆర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న కరణం వెంకటేష్‌బాబు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్వేచ్ఛ, ప్రశాంతత మా నినాదం.. చీరాల నియోజకవర్గ ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. కొన్ని దుష్టశక్తులు చీరాల ప్రశాంత తను అడ్డుకోవాలని చూస్తున్నాయి. అలాంటి వారిని తరిమి తరిమి కొడతాం. పేస్‌బుక్కుల్లో కాదు దమ్ము ధైర్యం ఉంటే రండి చూసుకుందాం అంటూ వైసిపి చీరాల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ చేసిన వాఖ్యలు చీరాల, పర్చూరు రాజకీయాల్లో కాకరేపాయి.

వైఎస్. రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా చీరాల గడియార స్తంభం కూడలిలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ.. చీరాల నియోజకవర్గంలో ప్రశాం తమైన వాతావరణంలో ఎమ్మెల్యే కరణం బలరామకష్ణమూర్తి ప్రణాళికా బద్ధంగా సంక్షేమ, అభివద్ధి కార్యక్ర మాలను అమలు చేస్తు న్నారన్నారు. అభివద్ధిని చూసి ఓర్వలేని వారు, ప్రక్క నియోజక వర్గానికి వెళ్లిన వారు, వేరే పార్టీలో చేరిన వారు, వారి మద్దతుదారులు నోటికి వచ్చి నట్లు మాట్లాడుతున్నారని ▶ 2లో



జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో నీటి ప్రవాహం

నీటిలో మునిగిన జగనన్న కాలనీ దారి

ప్రజాశక్తి-గిద్దలూరు: శనివారం రాత్రి కురిసిన వర్షానికి నగర పంచాయతీ పరిధిలోని కొండపేట వద్ద గల జగనన్న కాలనీకి వెళ్లే దారి పూర్తిగా నీట మునిగింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలనీవాసులకు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయాలని వారు కోరారు. జగనన్న కాలనీకి చెరువు అలుగు మీదుగా దారి వేయడంతో ఇప్పుడా దారి మీదుగా అలుగు పారుతోంది. ఫలితంగా జగనన్న కాలనీకి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు కురిసి చెరువు అలుగు పారినప్పుడల్లా తమకు ఇక్కట్లు తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఊరిస్తున్న వర్షం

(మొదటిపేజీ తరువాయి)

42.4, నాగులుప్పలపాడులో 41.2, దొనకొండలో 36 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కంభంలో 32.8 మిల్లీమీటర్లు, పొదిలిలో 32.6, సిఎస్‌పురంలో 32.4, కెకెమిట్లలో 28.2, వెలిగండ్లలో 27.4, కొత్తపట్నంలో 26.8, దోర్నాలలో 26.8, కురిచేడులో 26.4, తర్లుపాడులో 24.8, ముండ్ల మూరులో 22.4, పావమూరులో 22.4, మార్కా పురంలో 21.8, బేస్తవారిపేటలో 18.4, పిసిపల్లిలో 14.8, పెద్దారవీడులో 8.8, యర్రగొండపాలెం 8.6, అర్ధవీడులో 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

'కరణం' వ్యాఖ్యలతో రాజకీయ కాక

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడితే చెంపలు పగల కొడతామని ఆయన హెచ్చరించారు. ఎవరి పని వారు చేసుకుంటే ప్రశాంతంగా ఉం టుందని, లేదని నోరు జారి మాట్లాడితే, సామాజిక మాధ్యమాల్లో పిచ్చి వాఖ్యలు చేస్తే అంతు తేలుస్తామని వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎక్కడో ఉండి మాట్లాడటం కాదు దమ్ము వుంటే ఎదురు పడాలని ఆయన సవాల్ విసిరారు. వైసిపి కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజల జోలికి వస్తే సహించేది లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యే గా పోటీచేసి గెలుస్తానని కరణం వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. కరణం వెంకటేష్ చేసిన వాఖ్యలు ఆమంచి సోదరులను ఉద్దేశించి చేసినట్లు వెల్లడవంతో కరణం వాఖ్యలు ఇటు చీరాల అటు పర్చూరు నియోజకవర్గంలో కాకరేపాయి.

పందిళ్ళపల్లిలో నిర్వహించిన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆమంచి స్వాములు దీనికి ప్రతిగా ప్రతి సవాళ్లు విసిశారు. అవసరమైన సమ యంలో తమ దమ్ము చూపిస్తామని తెలిపారు. దీంతో రాజకీ య వాతావరణం వేడెక్కింది. చీరాలలో ఆమంచి కృష్ణమోహ న్ అను చరులుగా ఉన్నవారు ఆదివారం విలేఖర్ల సమావేశం నిర్వహించి కరణం వెంకటేష్ వాఖ్యలను ఖండించారు.

గత నెలలో రామన్న పేట పంచాయితీ ఎన్నికల సమయంలో కరణం, ఆమంచి గ్రూపుల మధ్య ఘర్షణలు జరిగాయి. అనంతరం బాపట్లలో నియోజకవర్గాల వారీగా జరిగిన సమీక్షలో వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ఉభయులతో చర్చించి వివాదాలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మంత్రి మేరుగ నాగార్జున ఆదివారం ఒంగోలు వచ్చి మాజీ మంత్రి బాలినేని, కరణం వెంకటేష్‌తో బాలినేని నివాసంలో భేటీ అయ్యారు. చీరాల, పర్చూరు వైసిపిలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనలపై చర్చించినట్లు తెలుస్తుంది. చీరాల వైసిపిలో గ్రూపుల పోరుతో ఇటీవల పర్చూరులో బాలినేని అనుచరులుగా ఉన్నవారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో పార్టీ ఇన్‌ఛార్జీ ఆమంచి కృష్ణమోహన్ ఫొటో లేకుండా వేయడంపై చర్చ జరిగినట్లు తెలుస్తుంది. బాపట్ల జిల్లాలోని చీరాల, పర్చూరు వైసిసిలో గ్రూపుల పోరు అధిష్టానానికి తలనొప్పిగా మారిన నేపథ్యంలో పోరుకు పరిష్కార మార్గం చూపే దిశగా మంత్రి నాగార్జున బాలినేని, వెంకటేష్‌లతో చర్చించినట్లుగా భావిస్తున్నారు.

పలుచోట్ల వర్షాలు..

వాగులు, చెరువులకు జలకళ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి వాగు లు, చెరువులకు క్రమంగా నీరు వచ్చి చేరుతోంది. కొండలపై కురిసిన వర్షపు నీరంతా గండి చెరువుకు వచ్చి చేరింది. అలాగే గత పదేళ్లుగా చుక్క నీరు నిలువని మురారిపల్లి చెరువుకు సైతం నీరు వచ్చి చేరుతోంది. రాళ్లవాగుపై గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాతి కత్తువలు, చెక్‌డ్యాంలు కట్టిన నేపథ్యంలో రాళ్లవాగు వర్షపు నీటితో పారడమే గగనమైంది. కాగా పక్కా గృహాలు నిర్మించుకునే వాళ్ల చెక్ డ్యాంలు, రాతి కత్తువలకు వినియోగించిన రాళ్లను ఎప్పటికప్పుడు తీసుకెళ్లడంతో రాళ్లవాగు ద్వారా నీరు పార డం ప్రారంభమైంది. మురారిపల్లి అలుగుపారితే మూడు సంవత్సరాలు పాటు బోర్లలో నీటి మట్టం ఉంటుందని రైతులు చెబుతున్నారు. అలాగే యర్రగొండపాలెంలోని పెద్దచెరువు, పుల్లలచెరువులోని చిన్న కండ్లేరుకు నీరు వచ్చి



వాగులో ఉధృతంగా ప్రవహిస్తోన్న వర్షపు నీరు

చేరుతోంది. పొలాల్లో తవ్వుకున్న నీటి కుంటలు నిండాయి. కురిసిన వర్షంతో పది పదిహేను రోజుల పాటు పశువులకు నీటికి ఢోకా ఉండదని పశుపోషకులు చెబుతున్నారు. రైతులు మాత్రం ఈ వర్షంతో ఉద్యాన పంటలకు ఉపయోగమే కానీ, మిగతా పంటలకు కొంత మేరకు పొలాల్లో నీరు నిలిచి నాటిన విత్తనాలు కుళ్లిపోవడం తప్ప మొక్క మొలవదని చెబుతున్నారు. ఇలాంటి వర్షాలు నాలుగైదు రోజులు కురిస్తే మాత్రం పంటలు వేసుకోవడానికి పదును అవుతుందని, అంతే తప్ప కురిసిన వర్షంతో పెద్దగా ఉపయోగం లేదని రైతులు చెబుతున్నారు.

పంటలకు ఊరటనిచ్చిన వర్షం

ముండ్లమూరు: మండలంలో రైతులు సాగుచేసిన వరి, మిర్చి, మొక్కజొన్న పంటలకు వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితిలో శనివారం రాత్రి, ఆదివారం మధ్యాహ్నం వర్షం పడడంతో వాడిపోతున్న పంటలు తిరిగి కోలుకుంటాయని మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్షం పంటలకు ఊరటనిస్తుందని మండలంలోని పులిపాడు, ఉల్లగల్లు, పసుపుగల్లు, ముండ్లమూరు, పోలవరం, మారెళ్ల, నాయుడుపాలెం, యుఎంపురం, ఈదర, వేముల రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



సంఘటనా స్థలంలో పోలీసులు

గల్లంతైన యువకులను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు నల్లమల అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు సగిలేరు, ఉప్పు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. గిద్దలూరుకు చెందిన రహీమ్, ఖలీల్ అనే యువకులు ఆదివారం గిద్దలూరు నుంచి అంబవరానికి ద్విచక్ర వాహనంపై వెళుతూ ఉప్పు వాగు దాటుతూ నీటి ఉధృతికి వాగులో గల్లంతయ్యారు. గల్లంతైన యువకులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతూ పక్కనే ఉన్న చెట్టు పట్టుకొని రక్షించమని కేకలు వేయగా పక్కన ఉన్న ప్రజలు గమనించి 100కు ఫోన్ చేయగా సిఐ దేవప్రభాకర్ వెంటనే స్పందించి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. రోప్ ద్వారా ఇద్దరు యువకులను బయటకు తీసి రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిరంతరం సేవచేస్తా: అన్నం సతీష్

ప్రజాశక్తి-బాపట్ల

అన్నం సతీష్ ప్రభాకర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి రాజకీయాలకు అతీతంగా నిరంతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని పూర్వ శాసన మండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ ప్రకటించారు. ఆదివారం బాపట్ల పట్టణం ఇమ్మడిశెట్టి పాలెం-మద్దిబోయిన వారిపాలెం రహదారి మార్గంలో 45 సెంట్ల స్థలంలో ఆదివారం వృద్ధాశ్రమం బాలుర వసతి గృహ నిర్మాణానికి అన్నం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ఆదాయంలో సగభాగం సేవకే వెచ్చిస్తానన్నారు. బాపట్ల నియోజకవర్గంలో ఎటువంటి ఆధారం లేని వృద్ధులకు నేరుగా ఇళ్ల వద్దకే భోజనం, మందులు పంపిణీ చేస్తామని అన్నారు. రానున్న రోజుల్లో బాపట్లలో అన్ని సదుపాయాలతో వైద్యశాల ఏర్పాటు ఉచితంగా అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో రెండు అంబులెన్సులు ఏర్పాటు చేసి మహిళలు వృద్ధుల వైద్య అవసరాలకు తోడు ఎక్కడ ప్రమాదం జరిగినా ఉచిత అంబులెన్స్ సేవలు అందిస్తామన్నారు. విరాళాలు స్వీకరించకుండా తన సొంత నిధుల నుంచే చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పూర్తిస్థాయిలో నిర్వహిస్తామని అన్నారు.



వృద్ధాశ్రమం బాలుర వసతిగృహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెలమంచి

రైల్వే కేబుల్ పట్టివేత

ప్రజాశక్తి-దరిశి: రూ.80 వేలు విలువైన రైల్వే కేబుల్ దరిశిలో ఒక పాత ఇనుప కొట్టు సామానులో దొరికినట్లు, రైల్వే అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రైల్వే పోలీసుల ద్వారా సమాచారం.

జానపద గీతాల రారాజు కొసరాజు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

జానపద కవి సార్వ భౌమునిగా ప్రసిద్ధిగాంచిన కొసరాజు రాఘవయ్య చౌదరి కర్లపాలెం మండలంలోని చింతాయపాలెం గ్రామంలో జన్మించారని, బాపట్ల మండలం లోని అప్పికట్ల గ్రామంలో పెరిగి పెద్దవార య్యారని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ తెలిపారు. ఆదివారం బాపట్ల సాహితీ భారతి ఆధ్వర్యంలో జరిగిన కొస రాజు 118వ జయంతి సభకు రావూరి నరసిం హవర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొసరాజు దాదాపు 200 చిత్రాల లో వేయికి పైగా పాటలు రచించారని అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రజా కవి, వైద్య విద్వాన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కొస రాజు తొలుత రైతుబిడ్డ చిత్రంలో హీరోగా నటించారన్నారు. జానపద కవిగా ప్రసిద్ధి చెందినా సమకాలీన సామాజిక సమస్యల పట్ల ప్రజలను చైతన్యపరుస్తూ హాస్యంగా, వ్యంగ్యం గా పాటలు రచించి పండిత పామరులందరి అభిమానాన్ని చూరగొన్నారని అన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ ఏరువాక సాగారో, జయంబు నిశ్చయంబురా, ఏ నిమిషానికి ఏమి జరుగునో, మత్తు వదలరా నిద్దుర, సరదా సరదా సిగరెట్టు, అయ్యయ్యో జేబులో డబ్బులు పోయెనే, టౌను పక్కకెళ్లొద్దురో వంటి హాస్య సందేశాత్మక గీతాలు రచించి కొసరాజు తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ సభలో ఎన్ కృష్ణ, మర్రి మాల్యాద్రిరావు, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్ర మూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు, రెంటాల మురళీ రాధాకృష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు తదితరులు కొసరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



కొసరాజుకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

కూలిన గోడ.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక హిల్ టవర్స్ సమీపంలోని సంజయ్‌గాంధీ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ గోడ కూలిపోయింది. నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వెనుక వైపున నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న గోడ కూలి పక్కనున్న ఇళ్లవైపు పడింది. ఆదివారం ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో అటుగా ప్రజల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే కూలిన గోడకింద పడిన ఓ మోటారు బైక్ నుజ్జునుజ్జుఅయ్యింది. నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం చేస్తున్నారని, ఇష్టారీతిన కట్టడాలు చేస్తున్నా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోడ కూలిన ఘటనపై ఇంటి నిర్మాణ యజమానిని స్థానికులు ఈ విషయంపై ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని ఎదురు దాడికి దిగుతున్నాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న కట్టడం విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



గోడ కూలిన దృశ్యం

చెరువుకట్టనే పగులగొట్టారు

- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న రైల్వే అధికారులు
- ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

రైల్వే అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తమ స్థలం ఉందంటూ ఏకంగా చెరువుకట్టనే పగులగొట్టి వదిలేశారు. శింగరాయకొండ మండలంలోని మూలగుంట పాడు, కలికివాయి, సోమరాజుపల్లి గ్రామాలకు అనుసంధానంగా ఉన్న జువ్వలగుంట చెరువు పరిస్థితి దారుణంగా తయారైంది. రైల్వే మూడో లైను పనులు జరుగుతున్న నేపథ్యంలో రైల్వే అధికారులు తమ స్థలం అక్కడ దాకా ఉందని ఏకంగా జువ్వలగుంట చెరువుకట్టనే పగలగొట్టి వెళ్లిపోయారు. అలా వదిలేసి వెళ్లిపోవడం వల్ల రానున్న వర్షాకాలం సమయంలో చెరువుకు నీరు వస్తే ఆ నీరు మొత్తం పొలాల్లోకి పోయే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. చెరువుకట్ట పగలగొట్టడం ద్వారా చాలా ఇబ్బందులు ఉన్నాయని, అధికారులు ఆలోచించి తమకు న్యాయం చేయాలని రైతన్నలు వేడుకుంటున్నారు. మూడు గ్రామాలకు ఉపయోగపడే ఈ చెరువుకట్టను పగలగొట్టడం ద్వారా వర్షపు నీరు చెరువులోకి వస్తే చుక్క మిగిలేటట్టు కనిపించడం లేదు. రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెరువుకట్టను పగలగొట్టి వదిలేశారని రైతులు వాపోతున్నారు. పట్టించుకోవాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువును గాలికి వదిలేశారు. రైతులు ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదంటున్నారు. మూడో రైల్వే లైన్ మొదలుపెట్టిన దగ్గర నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోందని రైతులు చెబుతున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఒక్కసారైనా పరిశీలించి పగులగొట్టిన కట్టను ఎలా చేయాలనేది కూడా ఆలోచించకపోవడం దారుణమని అన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని చెరువు కట్టను బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.



చెరువుకట్టను పగులగొట్టిన దృశ్యం

తీరంలో సోనా బోట్ల హల్‌చల్

- యథేచ్ఛగా మత్స్యసంపద దోపిడీ
- ఆందోళనలో మత్స్యకారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

తమిళనాడు నుంచి ఆదివారం నాడు 15 సోనా బోట్లు పాకల సముద్ర పరిధిలోకి వచ్చి హల్‌చల్ చేశాయి. సముద్రం ఒడ్డున ఉండి మేము చూస్తూ ఉండడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నామని ఇక్కడ మత్స్యకారులు వాపోతున్నారు. ఈ బోట్లు పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లిలో వేట సాగించాయని అన్నారు. మాకున్న సాధారణ బోట్లతో వేట సాగని పరిస్థితి. కానీ తమిళనాడు నుంచి వచ్చిన సోనా బోట్లు ఒక్కసారిగా పెద్ద వలవేసి చేపలను లాక్కుపోతున్నాయని మత్స్యకారులు చెబుతు న్నారు. ప్రతిరోజూ ఇలాగే ఒకటి రెండు బోట్లతో వేట చేసుకుంటున్నా ఎవరూ అడిగేవారు లేరు. జూన్ 15తో వేట నిషేధం ముగిసినప్పటి నుంచి తమకు సరైన వేట లేక అవస్థలు పడుతున్నామని, తమిళనాడు రాష్ట్రం నుంచి వచ్చిన సోనా బోట్ల దెబ్బకు ఇక్కడ మత్స్య సంపద మొత్తం హరించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టించుకోవలసిన మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు చేతులు ఎత్తివేయడంతో ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితిలో ఉన్నామని మత్స్యకారులు చెబుతున్నారు.



ఒడ్డునే తిరుగాడుతున్న సోనా బోట్లు

కుటుంబాన్ని కాపాడిన స్థానికులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కురిసిన వర్షానికి పుల్లలచెరువు మండలంలోని గుట్లపల్లి, ముటుకుల గ్రామాల మధ్య ఉన్న వాగు ఆదివారం ఉధృతంగా ప్రవహించింది. అయితే ప్రవాహం పెద్దగా లేదని భావించిన గుట్లపల్లి గ్రామానికి చెందిన కొమ్మనబోయిన వెంకటేశ్వర్లు తన కుమారుడు మోటారు సైకిల్‌పై ముటుకుల నుంచి గుట్లపల్లి వెళ్లేందుకు వాగు దాటే ప్రయత్నం చేశారు. అయితే వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు ఇద్దరూ నీళ్లలో కొట్టుకుపోయారు. వాగు మధ్యలో చెట్లు ఉండడంతో చెట్లను పట్టుకొని వారు పెద్దగా కేకలు వేశారు. అది గమనించిన గుట్లపల్లి గ్రామస్తులు హుటాహుటినా వాగులోకి దిగి వారిద్దరినీ కాపాడారు. అయితే మోటారు సైకిల్ మాత్రం వాగులో కొట్టుకుపోయింది. ఆ సమయంలో అక్కడ ప్రజలు లేకుంటే తాము కూడా నీటిలో కొట్టుకుపోయేవారమని తండ్రీ కొడుకులిద్దరూ బోరున విలపించారు.



వాగులో కొట్టుకుపోతున్న తండ్రీ కొడుకులు

మహిళపై వాలంటీరు అత్యాచారయత్నం

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మహిళపై దౌర్జన్యం చేసి ఆపై అత్యాచార యత్నానికి పాల్పడిన గ్రామ వాలంటీర్ ఉదంతమిది. ఈ సంఘటన చెరుకుపల్లి మండల పరిధిలోని ఆళ్లవారిపాలెం పంచాయతీ బాప్టిస్ట్ పాలెంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. బాప్టిస్ట్ పాలేనికి చెందిన చింతగుంట నవీన తన ఇంట్లో పని చేసుకుంటుండగా ఆ ప్రాంతానికి చెందిన వాలంటీర్ గాలిమోటు లోకకుమార్ ఆమె ఇంట్లోకి ప్రవేశించి తన కోరిక తీర్చాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఆమెను బలవంతం చేశాడు. అతని మాటలకు బెదిరి పారిపోయేందుకు ప్రయత్నించిన నవీన కాలు బెణకడంతో కేకలు వేసింది. నవీన కేకలు విన్న సమీపంలోని ప్రజలు ఇంటికి రాగా లోకకుమార్ వెంటనే బయటకు వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితురాలు నవీన చెరుకుపల్లి పోలీసులకు ఫిర్యాదు అందజేసింది. విచారించి కేసు నమోదు చేస్తామని చెరుకుపల్లి ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

వాలంటీర్ వివాదాస్పద వైఖరి

తమ గ్రామ వాలంటీర్ గాలిమోటు లోకకుమార్ తమను దుర్భాషలాడుతుం టాడని, ప్రభుత్వ పథకాలు అందించేందుకు కూడా తమ ఇళ్ల వద్దకు రాడని, తాము గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ వద్దకు వెళ్లి పెన్షన్ డబ్బులు తెచ్చుకుంటామని ఆ వార్డు సభ్యురాలు చింతకుంట మార్తమ్మ వాపోయింది. ఇటువంటి వ్యక్తిపై కేసు నమోదు చేసి శిక్షించాలని ఆమె వేడుకుంటోంది.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్పి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సైబర్ స్టాకింగ్ నేరాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా వుండాలని ప్రకాశం జిల్లా ఎస్పి మలిక గర్గ్ సూచించారు. సైబర్ స్టాకింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇ-మెయిల్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి ఇతర సోషల్ మీడియా ద్వారా ఒక వ్యక్తిని లేదా వ్యక్తుల సమూహాన్ని వేధించడానికి ప్రమాదకర విషయాలను పంపడం, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, పరువు భంగం, సెక్స్ కోసం విన్నపం, తప్పుడు ఆరోపణలు వంటివి ఉంటాయన్నారు. సైబర్ స్టాకింగ్‌కు పాల్పడేవారు బాధితుడికి సుపరిచితుడు లేదా పూర్తి అపరిచితుడు కావచ్చని, వారు ఇతరుల సోషల్ మీడియా ఖాతాలను యాక్సెస్ చేయడం ద్వారా ఆన్‌లైన్ కార్యకలాపాలు, వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకుంటారన్నారు. జిపిఎస్ లేదా కొన్ని స్పైవేర్‌లను ఉపయోగించి మీ ఫోన్ నంబర్ లేదా మీ స్నేహితులు, బంధువులు వివరాలు, మీ పని స్థలం వంటి వ్యక్తిగత సమాచారాన్ని, లొకేషన్‌ను ట్రాక్ చేస్తారని అన్నారు. తద్వారా పలురకాల ఇబ్బందికి, భావోద్వేగంగా, మానసికంగా వేధింపులకు పాల్పడతారని, ప్రజలు స్టాకింగ్‌కు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్పి సూచించారు.



మాట్లాడుతున్న ఎస్పి మలికాగర్గ్

ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు

ఏదైనా సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు మీ కుటుంబం, తెలిసిన స్నేహితులలో ప్రైవసీ సెట్టింగ్‌ను పరిమితం చేయడం ఉత్తమం.

- ఎవరైనా స్నేహితుల అభ్యర్థనను అంగీకరించే ముందు సోషల్ మీడియాలో వ్యక్తి ప్రామాణికతను ఎల్లప్పుడూ తనిఖీ చేయండి. సోషల్ మీడియాలో అనామక ఆన్‌లైన్ స్నేహితులను నమ్మవద్దు.
- మీ ఆన్‌లైన్ స్నేహితుడు మీ ఫొటోలు, వ్యక్తిగత సమాచారం డిమాండ్ చేస్తే ఫొటోలను/వీడియోలను వారితో ఎప్పుడూ పంచుకోకండి.
- మీ వ్యక్తిగత సమాచారం/ ఫొటోలు/ వీడియోలను సోషల్ మీడియాలో పబ్లిక్‌గా భాగస్వామ్యం చేయవద్దు.
- మీ ఆన్‌లైన్ స్నేహితులు మీ ఫోటోలపై లేదా ఏదైనా కార్యకలాపాలపై ఏమి వ్యాఖ్యానిస్తున్నారో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండండి.
- సోషల్ మీడియా స్నేహితుడు ఎవరైనా మీతో తప్పుగా ప్రవర్తిస్తే లేదా కొన్ని అనామక కార్యాచరణలు చేస్తే వాటిని రిపోర్ట్ చేయ్యడం లేదా వారిని బ్లాక్ చెయ్యడం, ఆ తర్వాత కూడా వారు మిమ్మల్ని అనుసరించడానికి ప్రయత్నిస్తే పోలీసులతో వారిపై ఫిర్యాదు చేయడానికి ఆలస్యం చేయవద్దు.
- మీ కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేస్తున్నప్పుడు మీ లొకేషన్‌ని షేర్ చేయవద్దు.
- మీపై సైబర్ స్టాకింగ్ లేదా ఏదైనా అనామక కార్యకలాపాలు జరుగుతున్నాయని మీకు అనిపిస్తే ఆలస్యం చెయ్యకుండా వెంటనే మీ సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చెయ్యాలని కోరారు.



బోల్తా పడిన ట్రాక్టర్ (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన అశోక్

ట్రాక్టర్ తిరగబడి యువరైతు మృతి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ట్రాక్టర్ తిరగబడి యువరైతు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కోలలపూడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ, సాయి ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాదినేని కోటయ్య, సుబ్బాయమ్మ దంపతుల కుమారుడైన అశోక్(31) తమ పొలం దున్నడానికి ట్రాక్టర్‌కు గొర్రు తగిలించుకొని వెళుతున్నాడు. కోలలపూడి నుంచి మామిడి తోటలవైపు వెళుతుండగా ఒక్కసారిగా గేదెలు అడ్డు రావడంతో అదుపుతప్పిన ట్రాక్టర్ పక్కనే సైడ్ కాలువలోకి దూసుకు పోయి తిరగబడింది. ఈ ప్రమాదంలో అశోక్ మీద ట్రాక్టర్ పడటంతో తీవ్రం గా గాయపడ్డాడు. స్థానిక రైతులు ఇచ్చిన సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది తీవ్రంగా గాయపడిన అశోక్‌ను మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు ప్రమాదంలో మృతి చెందడంతో అశోక్ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.



ఆర్‌టిసి బస్టాండ్‌లో యాచకుడు మృతి

ప్రజాశక్తి-పొదిలి: పొదిలి ఆర్టీసి బస్టాండ్లో ఒక యాచకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. తెల్లవారు జామున నుంచే ఆర్టీసి సిబ్బంది కదిపినా ఎంతకీ కదలకపోవడంతో 108కి సమాచారం ఇచ్చారు. సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు కొనకనమిట్ల మండలం నాయుడుపేట ప్రాంత వాసిగా సమాచారం.

లారీని ఢీకొన్న బైకు

ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ-కందుకూరు రోడ్డులోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల దాటిన తర్వాత ఆదివారం రాత్రి లారీని బైక్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. కందుకూరుకు చెందిన హరిణి ఆసుపత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్న ఎలికా సాయికుమార్(27) ఆటో డ్రైవర్‌గా ఉన్న నాయుడు మహేష్(28) అనే ఇద్దరు యువకులు మోటార్ బైక్ మీద కందుకూరు నుంచి శింగరాయకొండకు వస్తుండగా పలుకూరు అడ్డరోడ్డు దాటిన తర్వాత బస్సును క్రాస్ చేయబోయి శింగరాయకొండ నుంచి కందుకూరు వెళుతున్న లారీని ముందువైపు మోటారు బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మహేష్‌కు వివాహం కాగా సాయికుమార్‌కు ఇంకా వివాహం కాలేదు. ఇద్దరు స్నేహితులు కావడంతో మోటార్ బైక్ వేసుకొని శింగరాయకొండకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగి ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి శ్రీరామ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కందుకూరు ఏరియా వైద్యశాలకు మృతదేహాలను తరలించారు.



మృతిచెందినన స్నేహితులు (ఫైల్)

వర్షంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశ

ఖరీఫ్ పైనే ఆశలన్నీఅంటున్న రైతులు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఖరీఫ్ ప్రారంభమైనప్పటికి వర్షాలు లేక తీవ్ర ఎండలకు భయపడుతున్న రైతన్నలకు ఆదివారం కురిసిన వర్షం రైతుల్లో ఆశలు నింపింది. ఒక వైపు ప్రాజెక్టుల్లో నీరు లేక మరో వైపు తీవ్ర ఎండలతో పొలాలు నెర్రెలు బారాయి. నీటి కోసం ఎదురు చూస్తున్నాయిఇ. పదును కోసం బిక్కు బిక్కు మంటూ చూస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఆదివారం కురిసిన వర్షంతో పంట పొలాలు తడిసి ముద్దయ్యాయి. ఏ పంటలు వేయాలా అని ఆలోచిస్తున్న రైతులకు వర్షం ఊపిరి పోసింది. పర్చూరు – ఇంకొల్లు మధ్య పొలాలు వర్షపు నీటితో నిండిపోయాయి. పాటికే పర్చూరు ప్రాంతంలో రైతులు ప్రత్తి సాగు చేశారు. మిర్చి సాగు చేయాలంటే రైతులు ఖర్చులకు వెనకాడుతున్నారు. వర్షాలపై ఆధారపడి నీరు లేక మిర్చి సాగు చేస్తే అప్పుల పాలవ్వక తప్పదనే ఆలోచనలో రైతులు ఉన్నారు. మినుము సాగు చేయాలనుకునే రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వీరికి ఈ వర్షం ఆనందం నిపించిది. మండలంలో 6వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

భట్టిప్రోలు : గత పది పదిహేను రోజులుగా వర్షాలు లేక ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన వరి పంట ఎండిపోతున్న క్రమంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పైరు ఊపిరి పోసుకుంది. ఏడాది మండలంలో సుమారు 14 వేల ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేశారు. నిన్నా మొన్నటి వరకు వేసవి కాలాన్ని తలపించే విధంగా ఎండలు కాశాయి. మాగాని పొలాల్లో వరి నాట్లు వేసేవారు సైతం ఎండలకు అల్లాడిపోయారు. వేసిన వరి నాట్లు కూడా సాగునీరు అందక బీటల వారిన పరిస్థితి నెలకొంది. విడుదలయ్యే సాగునీరు కూడా పూర్తిస్థాయిలో దిగువ ప్రాంతాలకు అందకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేలాది రూపాయలు వెచ్చించి సాగు చేసిన వరి పంట నీరు లేక ఎండిపోతుండటంతో రైతుల్లో కలవరం పుట్టింది. ఇలాంటి తరుణంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షం పైరుకు ఊపిరి పోసినట్లయ్యింది. ఇదిలా ఉండగా అద్దేపల్లి బాడవ పొలాలలో ఇంకా 500 ఎకరాల వరకు నాట్లు వేయాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాలు ఇలాగే కొనసాగితే అవి కూడా వరి నాట్లు వేసే అవకాశం కనిపిస్తుంది.


ఆదివారం కురిసిన వర్షానికి ఇంకొల్లు పొలాల్లో వర్షపునీళ్లు


బట్టిప్రోలులో వర్షానికి ఊపిరి పోసుకున్న వరి పంట

చుక్కనీరు లేని ఏల్చూరు ఇరిగేషన్ చెరువు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు ఇరిగేషన్ చెరువు కింద వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. చెరువులో చుక్కనీరు లేకుండా దర్శన మిస్తోంది. ఈ చెరువు 300 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఉంది. చెరువు కింద ఏటా వెయ్యి ఎకరాలలో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి నారుమల్లు పోసి అక్టోబర్ నెల కల్లా నాట్లు వేసేవారు. అయితే రెండు నెలల క్రితం చెరువులో చేపలు పెంచిన గుత్తేదారుడు చెరువులోని నీటిని మొత్తం బయటకు పంపి చేపలు పట్టుకున్నాడు. దీంతో చెరువులో నీరు ఖాళీ అయింది. చెరువులో నీటిని తొలగించకుండా చేపలు పట్టుకోవాలనే నిబంధనలను తుంగలో తొక్కారు. వర్షాలతోనైనా చెరువుకు నీరు చేరకపోతుందానని రైతులు ఎదురు చూడ సాగారు. సాగర్ నీటితోనైనా చెరువును నింపవచ్చునుకుంటే సాగర్ నీరు ఇంతవరకు విడుదల కాలేదు. గతకొన్ని ఏళ్లుగా వరి సాగు చేస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏమి చేయాలో దిక్కు తోచడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.


చుక్కనీళ్లు లేక ఎండిపోయిన ఏల్చూరు చెరువు

అభివృద్ధిలో 'కొత్త'పేట

- ఎమ్మెల్యే బలరాం సహకారంతో అభివృద్ధి పనులు
- రూ.1.80కోట్లలతో నిర్మాణ పనులు
- అభివృద్ధే లక్ష్యంగా పనులు : కార్యదర్శి రమేష్ బాబు

ప్రజాశక్తి - చీరాల

ప్రజల మౌళిక అవసరాలు తీరుస్తూ అభివృద్ధి పథంలో వేటపాలెం మండలం కొత్తపేట పంచాయితీ దూసుకుపోతుంది. ప్రజలకు సౌకర్యవంతంగా కావలసిన రోడ్లు, డ్రైన్లు, విద్యుత్తు సౌకర్యంతో పాటు నూతన పైపులైన్ నిర్మాణాలను చేపట్టారు. ఇటీవల పనులు పూర్తి చేశారు. ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారి శేషయ్య సహకారంతో సుమారు రూ.1.80కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అభివృద్ధిలో ఇతర పంచాయతీలకు ఆదర్శంగా కొత్తపేట పంచాయతీ నిలుస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా డబల్ రోడ్డు నిర్మాణాలు, విద్యుత్తు స్తంభాలు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు, సిమెంట్ రోడ్లతో పాటు రోశయ్య కాలనీలో రూ.15లక్షలతో త్రాగునీటి పైపులైను పనులు చేపట్టారు. పంచాయితీ కార్యాలయం నుండి డిఎస్‌పి ఆఫీసులు, టూటౌన్ పోలీసు స్టేషన్ వరకు రూ.1 కోటి 80లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. పంచాయతీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా జెకె అపార్టు మెంట్ నుండి బిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు, ఎమ్మెల్సీ పోతుల సునీత ఇంటి వద్ద రోడ్డు, ప్రసాద్ నగర్ లో సెయింట్ పాల్స్ వద్ద, రోడ్లు, విద్యుట్ లైన్‌లు, డ్రికింగ్ వాటర్, వంటి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ రంజిత్ భాష, ఎస్పీ వకుల్ జిందాల్, జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే కరణం బలరాం, ఇన్చార్జి కరణం వెంకటేష్ పలువురు ప్రముఖుల సమక్షంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పంచాయితీ అధికారుల పనితీరును గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.


వడ్డెసంఘం పైపులైన్ పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణమూర్తి
డబుల్ రోడ్డుగా నిర్మించి ప్రారంభించిన డిఎస్‌పి కార్యాలయం

అభివృద్ధి పైనే దృష్టి


బి రమేష్ బాబు,
పంచాయతీ కార్యదర్శి

పంచాయతీలో అభివృద్ధి పనులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి 80 లక్షలతో అభివృద్ధి పనులు చేసినట్లు కార్యదర్శి బి రమేష్ బాబు అన్నారు. ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి ఇన్చార్జి కరుణం వెంకటేష్ బాబు, మండల ప్రత్యేక అధికారి ఎస్ శేషయ్య, ఇతర అధికారుల సహకారంతో అభివృద్ధి పనులను చేసినట్లు తెలిపారు. విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రాంతంలోని ఐటీసీ కాలనీలో రూ.3లక్షలతో నూతన కరెంటు లైన్‌లో వేశామని అన్నారు. వడ్డే సంఘంలో రూ.3లక్షలతో మరొక కరెంటు లైన్ వేసినట్లు తెలిపారు. ప్రధానమైన వీధుల్లో సిసి రోడ్లు నిర్మించామని అన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె


రేపల్లె సిఐ నజీర్‌బేగ్

సైబర్ నేరాల వలలోపడి ప్రజలు మోసపోతున్నారని సీఐ నజీర్ బేగ్ అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినప్పుడు ఓటీపీ చెప్పకూడదని అన్నారు. సైబర్ నేరలకు గురై డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నారు. ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచిత వ్యక్తులకు తెలపవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని అన్నారు. సైబర్ నేరగాళ్లు చూపే అత్యాశకు ఆశపడి ఎంతోమంది లక్షలాది రూపాయలను పోగొట్టుకున్నారని చెప్పారు.

గౌరాబత్తునికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - వేటపాలెం


అద్యాపకులు రవిబాబు

బాపట్ల వ్యవసాయ కళాశాలలో అద్యాపకునిగా పనిచేస్తున్న వేటపాలెం ప్రాంతానికి చెందిన గౌరాభక్తుని రవిబాబు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు ప్రభుత్వం ఆదివారం ప్రకటించడంపట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన 1985 – 89లో అగ్రికల్చర్ బిటెక్ పూర్తి చేశారు. 1990 – 92లో ఉత్తరప్రదేశ్‌లో అగ్రికల్చర్ ఎంటెక్ పూర్తి చేశారు. 2009 – 2012లో కోయంబత్తూర్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ పీహెచ్డీ పూర్తి చేశారు. 1999 జనవరి 11న బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో అద్యాపకునిగా చేరారు. వ్యవసాయ శాస్త్రవేత్తగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. అగ్రికల్చర్ పిహెచ్డి విద్యార్థుల పరిశోధనలకు గైడ్‌గా, చైర్మన్‌గా వ్యవహరించారు. గత ఐదు సంవత్సరాలలో 30కిపైగా పరిశోధన వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ జనరల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రతి వెంకట సుబ్బారావు అభినందించారు. చదువుతోపాటు సామాజిక సేవా రంగాల్లో ముందుంటారని తెలిపారు.



యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్‌లో వినయ్‌కుమార్

జీతాలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బాపట్ల

బదిలీలైన ఉపాధ్యాయులకు గత 3నెలలుగా జీతాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జడ వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు అన్నారు. యూటిఎఫ్ మధ్యంతర జిల్లా కౌన్సిల్ స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడిచి అక్రమ బదిలీలకు ప్రభుత్వం తెరతీసిందని ఆరోపించారు. వెంటనే అక్రమ వాట్సప్ బదిలీలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపియస్ విదానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో జీపియస్ అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విదానం (ఓపియస్) పునరుద్ధరించాలని కోరారు. 117జీవో వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ పోస్టులు రద్దు కావడంతో విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని అన్నారు. తక్షణమే 117జీవో రద్దు చేసి విద్యా వ్యవస్థను కాపాడాలని కోరారు. సమావేశంలో బాపట్ల జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ పాపారావు, సహాధ్యక్షులు బండి భిక్షాలు బాబు, కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, కార్యవర్గ సభ్యులు పద్మావతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బాపయ్య పాల్గొన్నారు.


వధువును దీవిస్తున్న ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

శుభకార్యాల్లో ఎమ్మెల్యే గొట్టిపాటి

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని బొమ్మనంపాడులో కామేపల్లి రమేష్ బాబు, వరలక్ష్మీ దంపతుల కుమార్తె వివాహానికి ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ హాజరై వధూవరులు తేజస్విని, చైతన్యను ఆశీర్వదించారు. గోపాలపురంలో మల్లిపెద్ది శ్రీనివాసరావు, రామాంజమ్మ దంపతుల కుమారుని వివాహం ఈనెల 1న జరుగగా ఆదివారం సత్యనారాయణ స్వామివ్రతంకు హాజరయ్యారు. నవ దంపతులు రాజేష్, జాహ్నవిలకు ఆశీస్సులు తెలిపారు. కోటిస్వాములు స్థానిక బొడ్డురాయి వద్ద మొక్కు చెల్లింపుకు హాజరయ్యారు. శ్రీనివాసరావు, లక్ష్మీనరసమ్మ దంపతుల కుమారుని వివాహంకు హాజరై వరుడు వెంకటేష్‌కు ఆశీస్సులు తెలిపారు. అద్దంకి పట్టణంలో మెల్లెంపూడి శ్రీకుమార్, శ్యామలాదేవి దంపతుల కుమారుని వివాహం ఒంగోలు ఏ1 ఫంక్షన్ హాల్‌లో జరుగగా హాజరై నూతన వధూవరులు కృష్ణతేజ, హారికను ఆశీర్వదించారు.


లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న టిడిపి నాయకులు సజ్జా

లోకేష్ పాదయాత్రలో సజ్జా

ప్రజాశక్తి - చీరాల

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తాడేపల్లిగూడెంలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో చీరాల టిడిపి సీనియర్ నాయకులు సజ్జా వెంకటేశ్వరరావు లోకేష్‌ను అనుసరించారు. ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి నియోజకవర్గంలో కృషి చేయాలన లోకేష్ సూచించారు. పార్టీ అమలు చేయబోయే సంక్షేమ పథకాలు, టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో చీరాలలో టిడిపి జెండా ఎగురవేయాలని కోరారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కనిగిరి

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య కనిగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగం-ప్రభుత్వ విధానాలు-కర్తవ్యాలు అనే అంశం పై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు డివైఎఫ్ఐ నాయకులు పి నరేంద్ర అధ్యక్షన జరిగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వర్లరెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తాము అధికారంలోకొస్తే ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. కేంద్రంలోని ప్రభుత్వ శాఖల్లో 9.82 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఒక రైల్వేలో 261234 అందులోనూ సేఫ్టీ డిపార్ట్మెంట్ లోనే 53178, ఆర్మీలో 4 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. బ్యాంకులు విలీనం చేయకముందు ఒక్క ఎస్బిఐలోనే 16వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించారు. విలీనం తర్వాత ఇప్పటిదాకా ఏ బ్యాంకు కూడా వేళల్లో పోస్టులు భర్తీ చేయలేదు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎయిర్ ఇండియా, ఓడరేవులు, ఆయిల్ కార్పొరేషన్లు, ఎన్ఎండిసి, ఉక్కు పరిశ్రమలు మొదలైన వాటిని ప్రైవేటీకరణ చేయడం ద్వారా ఆయా సంస్థల్లో ఉద్యోగాల కల్పన పూర్తిగా శూన్యంగా మారిందని తెలిపారు. జన విజ్ఞాన వేదిక నాయకులు వి మాలకొండారెడ్డి, జి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే 128000 సచివాలయ ఉద్యోగాలు, హెల్త్ డిపార్ట్మెంట్లో 10 వేల ఉద్యోగాలు ఇచ్చిన మాట వాస్తవమే. ఇప్పటికీ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో నూటికి నలభై శాతం మందిని రెగ్యులర్ చేయలేదన్నారు. మొత్తం గ్రూప్స్ ఉద్యోగాలు 5600 ఖాళీగా ఉంటే కేవలం 597 మాత్రమే ఇప్పుడు ప్రభుత్వ అనుమతి ఇచిందన్నారు. ఎస్సై కానిస్టేబుల్ 6,500 నోటిఫికేషన్ ఇచ్చారు వాస్తవానికి రాష్ట్రంలో 21000 ఖాళీగా ఉన్నాయని డీజీపీ ప్రకటించారన్నారు. దీన్నిబట్టి కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి పాలక పక్షాలు వ్యతిరేకంగా ఉన్నారు అలాగే ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అప్పజెప్పి వాటిలో ఉద్యోగాలు రాకుండా చేస్తున్నారు. కొత్తగా ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేసే ఆలోచన వీరికి లేదు. అందువల్ల భారత దేశంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగం ఒక దశలో 9.3 కి నిరుద్యోగం పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్ని భర్తీ చేయాలి, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, రాష్ట్రంలో టీచర్ పోస్టులు 45 వేలు, లైబ్రరీ సైన్సు పోస్టులు ఆరు వేలు, సచివాలయంలో ఎనిమిది వేలు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు నారాయణ,ధర్మయ్య,శ్రీను తదితరులు పాల్గొన్నారు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు


క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పొదిలి

ఈ నెల 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ (బాలుర)లో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టియుఎపి యూనియన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు ఆటల పోటీలను మార్కాపురం ఎమ్మెల్యే కె.పి నాగార్జున రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కాసేపు ఉపాధ్యాయులతో కలిసి క్రికెట్ ఆడారు. ఎమ్మెల్యే ఆడిన ప్రతి బాల్‌ను సిక్స్‌గా మలిచి గ్రౌండ్‌లో బాల్‌ను నలు దిక్కులుగా పరిగెత్తేలా చేసి ఉపాధ్యాయులను ఉత్తేజపరిచారు.


రమాదేవిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు

ప్రిన్సిపల్ రమాదేవికి సత్కారం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ప్రిన్సిపల్ నారాయణం రమాదేవిని ఆదివారం సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని సమైక్య లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఒంగోలు మండలం కరవది గ్రామంలోని వివేకానంద యూపీ పాఠశాల ప్రిన్సిపల్ రమాదేవి ఎంపికైన సంగతి తెలిసిందే. ఆదివారం గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అవార్డును ఎమ్మెల్సీలు కె లక్ష్మణరావు, ఎల్ అప్పిరెడ్డి నుంచి రమాదేవి అందుకున్నారు గత 25 సంవత్సరాలుగా విద్యతోపాటు విద్యార్థుల్లో సామాజిక సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఆమె చూపుతున్న ప్రతిభకు ఈ అవార్డు ప్రకటించినట్లు నిర్వాహకులు తెలిపారు కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్ బాబు డాక్టర్ నాగయ్య పాల్గొన్నారు

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : ఆదిమూలపు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో రథసారధి సిఎం జగన్‌మోహనరెడ్డి అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. ఆదివారం పెద్దదోర్నాలలోని ఒకటో సచివాలయం పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ పార్టీలో అన్ని అనుబంధ సంఘాలు సంస్థాగతంగా కలిసి పని చేసి పార్టీని బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు. సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేరుస్తున్నారని వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. చేనేతలకు ప్రభుత్వం మంచి సహాయం చేస్తోందని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న మేలును మర్చిపోలేమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుమ్మా పద్మజ, సర్పంచ్ చిత్తూరి హారిక, వైసీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, పెద్దారవీడు వైసీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు గురువారెడ్డి, జోగి వెంకట నారాయణ, షేక్ అబ్దుల్ మజీద్, రసూల్, గుండారెడ్డి రమణారెడ్డి, బొగ్గరపు రమేష్, యక్కంటి వెంకటేశ్వర్లరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గడప గడపకూలో మంత్రి ఆదిమూలపు సురేష్


భరతనాట్యం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు రాణించాలి

ప్రజాశక్తి-దరిశి

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని ప్రజా సంకల్పవేదిక రాష్ట్ర అధ్యక్షులు మదిరె రంగ సాయిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రజాసంకల్ప వేదిక ఆధ్వర్యంలో ఇటీవల విద్యార్థులకు నియోజకవర్గస్థాయిలో పరీక్షలు నిర్వహించగా అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మార్కాపురం లా కాలేజి ప్రిన్సిపల్ ప్రతిమ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం ఖాదర్‌మస్తాన్ అధ్యక్షత వహించగా నియోజకవర్గస్థాయిలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి మస్తాన్

ప్రజాశక్తి-కొండపి


సిపిఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం కొండపిలోని పోలేరమ్మతల్లి దేవస్థాన ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కెజి మస్తాన్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నమ్మించి ఓట్లను గుంజుకోవడం జరిగిందన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా నిరుద్యోగులను సృష్టించే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ భుజ స్తంభాల మీద వేసుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసిందని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగం అవకాశాలు, నిరుద్యోగ భృతి కావాలంటే నిరుద్యోగ యువకులు ఐక్యంగా నిలబడి ఈ దేశంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని కూలదూయాలని, బిజెపి నుంచి భారతదేశాన్ని రక్షించుకోవాలని యువకులకు, నిరుద్యోగులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జయరావు, బి.శ్రీను, కోటిరెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

ముగిసిన వైఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఆదివారం ఈ పోటీలు ముగిశాయి. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పోటీలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం మొదటి విజేతగా నిలిచిన దోర్నాలకు చెందిన విక్టరీ బాయ్స్ టీంకు రూ.50 వేలు నగదుతో పాటు ట్రోఫిని అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కడపరాజుపల్లి టీంకు రూ. 30 వేలు నగదుతో పాటు ట్రోఫిని అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన వైజాగ్ టీంకు రూ.20 వేలు నగదుతో పాటు ట్రోఫిని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ క్రీడలు ఆనందంతో పాటు ఆరోగ్యాన్నిస్తాయన్నారు. నియోజకవర్గం నుంచి క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని తెలిపారు. వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను రాష్ట్రస్థాయిలో నిర్వహించిన నిర్వాహకులకు ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, వైసీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, పెద్దారవీడు వైసీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు గురువారెడ్డి, జోగి వెంకట నారాయణ, షేక్ అబ్దుల్ మజీద్, రసూల్, గుండారెడ్డి రమణారెడ్డి, బొగ్గరపు రమేష్, యక్కంటి వెంకటేశ్వర్లరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో మంత్రి ఆదిమూలపు సురేష్


వధూవరులను ఆశీర్వదించిన ముత్తుముల

వధూవరులను ఆశీర్వదించిన ముత్తుముల

ప్రజాశక్తి - గిద్దలూరు

మండలంలోని అక్కలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ యర్రముద్ద వెంకటరెడ్డి కుమారుడు వెంకట సతీష్ రెడ్డి హరిణిల వివాహ మహోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని ఎస్ వై ఆర్ కళ్యాణమండపంలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, మరియు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలుకు చెందిన ఎల్ఐసి అధికారి పారా శ్రీనివాసరావు, మాధవి దంపతుల కుమార్తె హారిక, కృష్ణతేజ వివాహ వేడుకలు స్థానిక ఎ1 కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో అద్దంకి ఎమ్మెల్యే, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రైతులకు వ్యవసాయ రుణాలు

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండలం రామాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు సంఘం సిఇఒ సుంకరి అంజికుమార్ తెలిపారు. రుణాలు ఉపయోగించుకొని రైతు వ్యవసాయాభివృద్ధి పథంలో సాగాలని, తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివద్ధికి కషి చేయాలన్నారు. ఎకరా పొలంకు రూ.90వేలు చొప్పున రూ.3 లక్షల వరకు ఏడు శాతం వడ్డీ రేటుతో నూటికి 58 పైసలు వడ్డీ చొప్పున క్రాపు లోన్లు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ రుణాలు సంవత్సరంలోపు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎకరా పోలంకు రూ.2లక్షలు వరకు సబ్ రిజిస్ట్రార్ ఇచ్చే భూమి వ్యాల్యూషన్ సట్టిఫికెట్ ప్రకారం 12 శాతం వడ్డీ రేటుతో నూటికి రూ.11లు వడ్డీ ప్రకారం కర్శక మిత్ర రుణాలు ఇస్తున్నట్లు, వీటికి రెన్వువల్ అవకాశం ఉండదని సంవత్సరం చివరినాటికి రైతు తీసుకున్న రుణం మొత్తం చెల్లించాల్సి ఉంటుందని సిఈఓ తెలిపారు.

పొదిలి ఎస్ఐగా వెంకట సైదులు

ప్రజాశక్తి-పొదిలి



ఎస్ఐ వెంకటసైదులు

పొదిలి ఎస్సైగా వెంకట సైదులు ఎట్టకేలకు నియమితులయ్యారు. ఎస్ఐ పోస్ట్ కోసం పలువురు ముమ్మర ప్రయత్నాలు చేసిన విషయం విదితమే. ఇక్కడ పని చేసిన ఎస్సై మల్లికార్జునకు పదోన్నతి లభించి ఒంగోలు ట్రాఫిక్ సిఐగా వెళ్లడంతో ఈ పోస్ట్‌కు పలువురు ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు సమర్థవంతమైన అధికారిగా పేరున్న ఒంగోలులో పనిచేస్తున్న ఎస్ఐ వెంకటసైదులు పొదిలికి నియమించబడ్డారు. త్వరలో బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.



ఓటర్లతో మాట్లాడుతున్న అధికారులు

ఓటర్ల లిస్టులో చేర్పులు, మార్పులు సరి చూసుకోవాలి

ప్రజాశక్తి-దరిశి

ఓటర్ల లిస్టులో గతంలో తొలగించిన, చనిపోయిన ఓటర్లను సరి చూసుకోవాలని దరిశి నియోజకవర్గం ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లోకేశ్వరరావు అన్నారు. దరిశిలో ఎన్నికల కమీషనరు ఆదేశాల మేరకు తొలగించిన ఓటర్లను చేర్పులు, మార్పులు సరిచేసుకోవాలని బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు బాధ్యత సక్రమంగా నిర్వర్తించాలన్నారు. దరిశిలో కొన్ని ఇళ్లకు వెళ్ళి ఆదివారం ఓటర్ల జాబితాను గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిటి దేవప్రసాద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-పొదిలి

సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రముఖులు అన్నారు. ఆదివారం స్థానిక వాసవి కళ్యాణ్ సదన్ పొదిలిలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ సమావేశం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు జిసి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మానవతా సంస్థ వ్యవస్థాపకులు ఎన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మారుతున్న సమాజంలో ఆధునిక పోకడలు మానవ జీవితాన్ని వినాశనకర స్థితికి చేరుస్తున్నాయన్నారు. కార్యక్రమానికి కార్యనిర్వాహకులుగా కల్లం సుబ్బారెడ్డి, యలమందారెడ్డి, యక్కలి శేషగిరిరావు, మువ్వల పార్థు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ కడప సెంట్రల్ కమిటీ సభ్యులు ఆర్ గోపి, సుబ్బారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, కల్లూరి రామిరెడ్డి, ముక్కు బాలకష్ణారెడ్డి, సోమిశెట్టి శ్రీనివాసరావు, జీసి సుబ్బారావు, కాటూరి పెదబాబు, నూర్జహాన్, దార్నాసి రాము, మాకినేని రమణయ్య, జి చెన్నారెడ్డి, వినోద్, వెంకటేశ్వర్ రెడ్డి మల్లవరం, మేడా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు :శిద్ధా సుధీర్



కేక్ కట్ చేస్తున్న శిద్ధా సుధీర్ దంపతులు

ప్రజాశక్తి-చీమకుర్తి

దేవస్థానంలో భక్తులకు మెరుగైన సేవలందే విధంగా కృషి చేస్తానని, టిటిడి బోర్డు సభ్యునిగా తనను నియమించినందుకు సంతోషంగా ఉందనీ టిటిడి బోర్డు సభ్యులు శిద్ధా సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన, సతీమణి శిద్దాలక్ష్మీశృతితో కలిసి హరిహరక్షేత్రం సందర్శించారు. ఈ సందర్భంగా గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ గిరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను అభిమానుల మధ్య కట్ చేశారు. ముందుగా హరిహరక్షేత్రం వేదపండితులు పూర్ణకుంభంతో సుధీర్ దంపతులను స్వాగతం పలికారు. ఆలయ సముదాయంలో వారు విశేష పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు శిద్ధా సుధీర్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శిద్దాసుధీర్‌మాట్లాడుతూ టిటిడి బోర్డు సభ్యునిగా ప్రజల అవసరమైన సౌకర్యాల కల్పనలో తనవంతు కృషి చేస్తానన్నారు.భక్తులకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. టిటిడి బోర్డు సభ్యునిగా బాధ్యతలు తీసుకున్నాక తొలిసారిగా హరిహరక్షేత్రంలో పూజలు నిర్వహించడానికి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువనాయకులు శిద్దాసుధాకర్, ప్రముఖ నాయకులు కె రమణయ్య, కె గంగాధరరావు, ప్రముఖ గ్రానైట్ వ్యాపారులు మండవ శ్రీనివాసరావు, పిఎస్ఎన్ మూర్తి, తిమ్మారెడ్డి, బొమ్మిశెట్టి కిరణ్, నూకల సురేంద్ర, చల్లగండ్ల హనుమంతరావు, గ్రంధిశ్రీహరి, నూకల సుబ్రహ్మణ్యం, హరిప్రియ గ్రానైట్ అధినేతలు నూనె అనుదీప్, నూనె హేమసుందరరావు తదితరులు శిద్దాసుధీర్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

చెత్తా చెదారంతో కొత్త చెరువు

ప్రజాశక్తి-పామూరు

పామూరు కొత్త చెరువులో నీటిలో చెత్తచెదారం చేరి దుర్వాసన వెదజల్లుతున్నా సంబంధిత అధికారులకు పట్టడంలేదని భగత్‌సింగ్‌రోడ్, అంకాలమ్మ వీధిలోని నివాసులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని చేపలమార్కెట్ వెనుక భాగంలో కందుకూరు బస్టాండ్ సెంటర్ నిరంతరం జనసమీకరణ ఉన్న ప్రాంతం. దాని పక్కనే ఉన్న చెరువులో ఎప్పటి నుంచో ఉన్న చెత్తచెదారంతో నిండిపోయి విపరీతమైన వాసన వెదజల్లుతుంది. పక్కనే వాటర్ ప్లాంటు ఉండటంతో ప్రజలందరు త్రాగునీటికోసం ఆ ప్రాంతానికి రావాల్సి వస్తుంది. ప్రభుత్వం వ్యాధులను నివారించాలని సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకోవాలని ప్రకటనలు చేయడం తప్ప ఇలాంటి పారిశుధ్యం పై శ్రద్ధ పెట్టలేదని ప్రజలు అంటున్నారు. ప్రయాణికులు బస్సు ఎక్కేంతవరకు ఆ వాసన పీల్చుకుంటూ అక్కడ నిలబడక తప్పడంలేదంటున్నారు. చెత్తచెదారం తొలగించకపోతే ఆ ప్రాంత నివాసులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. నిత్యం రద్దీగా ఉన్న ఈ ప్రాంతంలో చెత్తచెదారంను తొలగించి బ్లీచింగ్ చల్లి వ్యాధుల నుండి కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



చెత్తచెదారంతో నిండిన ఉన్న కొత్తచెరువు నీళ్ళు

దర్శి ఎమ్మెల్యే టిక్కెట్ బూచేపల్లి కుటుంబానికే

- జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



కార్యక్రమానికి హాజరవుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-ముండ్లమూరు

దర్శి నియోజకవర్గం వైఎస్ఆర్ పార్టీ తరుపున బూచేపల్లి కుటుంబానికే అధిష్టానం మూడు రోజుల క్రితం ఖరారు చేసిందని జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. ఈదర పంచాయతీ పరిధిలోని కొమ్మవరం గ్రామానికి చెందిన రెడ్డి సంఘం అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి ఆదివారం ఆంకాలమ్మ గుడి వద్ద మొక్కులు తీర్చుకుంటుండగా కార్యక్రమానికి హాజరైన వెంకాయమ్మ అభిమానులు, కార్యకర్తలతో మాట్లాడారు. దర్శి వైసిపి టిక్కెట్ కోసం స్థానిక ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, బూచేపల్లి కుటుంబం పోటీ పడుతున్నప్పటికి వైసిపి అదిష్టానం నుంచి మూడు రోజుల క్రితం బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేరు ఖరారైందన్నారు. వైసిపి కన్వీనర్‌లను తమకు అనుకూలమైన వారిని నియమించుకోమని దర్శి, కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు, తాళ్లూరు మండలాలలో తమకు అనుకూలమైన అధికారులను నియమించుకోమని అదిష్టానం నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ సూదిదేవర అంజయ్య, నాయకులు అబ్బన ఆంజిరెడ్డి, కొండారెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, పి శ్రీనివాసరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన బూచేపల్లి అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని పలు శుభ కార్యక్రమాలలో ఒంగోలు మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్, కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొన్నారు. మండలంలోని గుర్రపడియ గ్రామానికి చెందిన మేకల బలరామిరెడ్డి, సుబ్బాయమ్మ కుమారుడు అశోక్‌రెడ్డి దంపతులను దామచర్ల సత్య పాల్గొని ఆశీర్వదించారు. చౌటపాలెం గ్రామంలో మేముల హరిబాబు కుమార్తె వివాహ వేడుకల్లో, కొండపిలోని కామేపల్లి రోడ్డులోని సాయి సీతారామా కళ్యాణ మండపంలో పోకూరి ముసలయ్య కుమారుని వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులనుఆశీర్వదించారు. కొండపిలోని ఆదేపల్లి సత్యనారాయణ గృహ ప్రవేశ, సత్యనారాయన స్వామి వ్రతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి.రామయ్యచౌదరి, వసంతరావు, రాష్ట్ర మహిళా నాయకులు రావిపాటి సీతమ్మ, జరుగుమల్లి నాయకులు రవి, పెదబాబు, పొన్నలూరు మండల నాయకులు, చౌటపాలెం గ్రామ టిడిపి నాయకులు, కొండపి గ్రామ నాయకులు నన్నూరి సుబ్బారామయ్య, శ్రీను, అదేపల్లి శ్రీను, ఆర్‌యంపి రాము, మండలంలోని టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య



శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్యశిబిరానికి విశేషస్పందన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరులో హైదరాబాద్ స్టార్ పౌండేషన్ ఆద్వర్యంలో ఉపాస్ సూపర్ స్పెషాలిటి ఆస్పత్రి వారి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిభిరానికి విశేష స్పందన వచ్చింది ఈ శిబిరంలో ఉపాస్ ఆస్పత్రి డైరెక్టరు ఆర్థోపెడిక్ సర్జన్ చవల ప్రకాష్, సాదారణ వ్యాధుల నిపుణులు డాక్టరు గోనుగుంట్ల శ్రీనావాసరావులు 200మందికి బిపి షుగర్ పరిక్షలతో పాటు కీళ్ళ నరాలకు సంబందించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టరు ప్రకాష్ మాట్లాడుతూ గ్రామీణప్రాంతంలో వైద్యశిబిరం క్రమం తప్పకుండా 7వ విడత నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటీ శిభిరాలకు తమవంతు సహకారం ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో స్టార్ పౌండేషన్ కార్యదర్శి తన్మయ్ రెడ్డి, విశ్రాంత హెల్త్ సూపర్ వైజర్ కెఎల్ నాగేశ్వరరావు, దుర్గాప్రసాదు, గోనుగుంట బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో అభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రామస్తులంతా ఐకమత్యంగా ఉండి గ్రామాన్ని అభివద్ధి పథంలో నడిపించాలని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య ఆకాంక్షించారు. మండలంలోని వాసేపల్లిపాడు గ్రామంలో అంకమ్మ తల్లి కొలుపుల కార్యక్రమం కోసం వారు గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్యకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వారు గ్రామ దేవత అంకమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈదర ప్రభాకర్, బొజ్జా శ్రీనివాసులు, నీలం రామయ్య, దూడల కోటయ్య, దూడల తిరుపతి స్వామి, మేడికొండ రవీంద్ర, ముత్తినేని హరిబాబు, ఆత్మకూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తరలి వెళ్లిన ఉద్యోగులు

ప్రజాశక్తి -కనిగిరి

వెనుకబడిన కనిగిరి ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పన కోసం గత నెల 24 న మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో, ఎస్వి ఎంటర్ప్రైజెస్, జనని చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన వారిలో మొదటివిడతగా ఆదివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్ నుంచి తరలివెళ్లారు. శ్రీసిటీ వద్ద గల హీరో మోటార్ కార్ప్ కంపెనీకి ఎంపికైన వారు ఉగ్ర ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. వెనుకబడ్డ కనిగిరి ప్రాంతంలో చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ జాబ్ మేళా ఏర్పాటు చేశారు.



ఎంపికైన ఉద్యోగాలకు వెళ్తున్న యువకులు

పంచాయతీలో అవినీతి - కుంటుపడిన పాలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు మేజర్ పంచాయతీలో రోజురోజుకు అవినీతి పెట్రేగిపోతుంది. పాలకవర్గంలో విభేదాలతో పాలన కుంటుబడింది. ప్రస్తుత పాలకవర్గం 2021మే నెలలో బాధ్యతలు చేపట్టింది. అప్పటి నుండి ఇప్పటివరకు గ్రామానికి చేసింది ఏమి లేదని గ్రామస్తులు చెబుతున్నారు. రూ.కోటికిపైగా ఆదాయం ఉన్న పంచాయతీలో ఎలాంటి పనులు చేపట్టకుండానే నిధులు దోచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నూతన పాలకవర్గం వచ్చేనాటికి పంచాయితీలో రూ.45లక్షలకుపైగా నిధులున్నాయి. వీటికి తోడు 14, 15వ ఆర్థిక సంఘం నుండి నిధులు వచ్చాయి. వీటిని కూడా దేనికి ఖర్చు పెట్టారో లెక్కలు తెలియదు. సర్పంచ్ ఒకవైపు, కొందరు పాలకవర్గ సభ్యులు మరొకవైపు గ్రూపులుగా చేరారు. ఎలాంటి పనులు చేయకుండానే నిధులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2022లో బ్లీచింగ్, సున్నం అధిక మొత్తంలో కొనుగోలు చేసినట్లుగా లెక్కలు ఉన్నాయని, అయితే ఆమేరకు సరుకు రాలేదని సిబ్బందిలోనే చర్చ జరుగుతుంది. బ్లీచింగ్ సప్లై చేసే కాంట్రాక్టర్‌తో కలిసి అధికారులు, పాలకవర్గ సభ్యులు నిధులు దోచుకున్నారనే ఆరోపణ అందరినోటా వినిపిస్తున్నాయి. ఈ మిగులు నిధుల నుండి పాలకవర్గం



అవినీతికి కేంద్రంగా మారిన బట్టిప్రోలు పంచాయితీ భవనం

వాటాలు ఇవ్వాలని కోరడంతో సర్పంచ్ ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున ఇస్తానని ఒప్పుకొని ఒక్కొక్కరికి రూ.30వేలే అందజేశారని కొందరు చెప్పుకోవడం అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో తెలియజేస్తుంది. ఈ సొమ్మును చట్ట బద్ధంగా ఖర్చుల్లో చూపే ప్రయత్నం చేశారు. రకరకాల బిల్లుల రూపంలో పాలకవర్గ ఆమోదానికి పెట్టడంతో అవినీతి జరుగుతుందనేది బహిరంగ రహస్యమైంది. పాలకవర్గం ఏర్పడిన నాటికి ఉన్న రూ.45లక్షల నిధులలో విద్యుత్ బిల్లులకు రూ.12లక్షల ఖర్చు చేయగా మిగిలిన సొమ్ము ఎం బుక్ ద్వారా రూ.19లక్షలు కనిపిస్తుంది. కానీ మిగిలిన సొమ్మును ఎలాంటి తీర్మానం చేయకుండా, పాలకవర్గం అనుమతి లేకుండా సర్పంచి దోచుకున్నారని పాలకవర్గంలో మరో గ్రూపు ఆరోపిస్తుంది. ఇవికాక 14, 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చుపై విచారణ చేపట్టాలంటూ సిఎఫ్ఎంఎస్ ఆధారాలతో పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పట్టించుకోవటం లేదనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పిర్యాదులపై విచారణ చేసిన అధికారులు సైతం తమపని తాము చూసుకుని పంచాయితీ రికార్డులను తిరిగి ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. కరోనా సమయంలో విడుదలైన ప్రత్యేక నిధులు కూడా ఎంత వచ్చాయో, దేనికే ఖర్చు పెట్టారో తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు పాలకవర్గ సభ్యులు ఎలాంటి పనులు చేపట్టకుండానే తప్పుడు బిల్లులు ఆమోదించాల అనటం, అది చూసిన సర్పంచి తాను మరికొన్ని బిల్లులు తెచ్చి వాటినీ ఆమోదించాలని పట్టుబట్టటంతో ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ గ్రామాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటిపై ఉన్నతాధికారులు విచారణ చేస్తేనే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. పంచాయితీ పాలనపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అడవులు సంరక్షణతో మానవాళి మనుగడకు రక్ష

● ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచండి. ● భావితరాలను కాలుష్యం నుండి కాపాడండి. ●ప్రజాశక్తితో డిఎఫ్ఓ ముఖాముఖి

ప్రజాశక్తి - బాపట్ల

స్వచ్ఛమైన గాలి, వాతావరణంకు అడవులే ప్రధానమైనవి. చెట్లు, అడవులను సంరక్షిస్తే అవే మానవాళిని రక్షిస్తాయనేది ప్రకృతి సూత్రం. అడవులను సంరక్షిస్తేన మానవాళికి మెరుగైన ఆహ్లాదమైన వాతావరణం ఇస్తాయని బాపట్ల జిల్లా అటవీ శాఖ అధికారి ఎల్ భీమయ్య తెలిపారు. జిల్లాలో అడవులు, వాటి సంరక్షణ, ప్రయోజనం, ఉపయోగాలపై ప్రజాశక్తితో ఆయన ముఖాముఖి మాట్లాడారు.

బాపట్ల జిల్లాలో 22వేల 995ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. రేపల్లె, బాపట్ల ప్రాంతంలో సముద్ర తీరం వెంబడి 7వేల5వందల ఎకరాల్లో మడ అడవులు తీర ప్రాంత ప్రజలకు రక్షణ కవచంగా ఉన్నాయి. రేపల్లె మండలం కొత్తపాలెం మొదలు బాపట్ల సూర్యలంక తీరం వరకు ఈ మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలకు రక్షణగా ఉంటూ జీవవైవిద్యాన్ని కాపాడుతున్నాయి. అటవీ ప్రాంతంలో జీడి మామిడి తోటలు 832ఎకరాల్లో అడవుల దీవి, ముత్తాయ్య


జిల్లా అటవీ శాఖ అధికారి ఎల్ భీమయ్య

పాలెం, మోటుపల్లి, పేర్లవారి పాలెం, పుల్లరిపాలెం అటవీ భూముల్లో ఉన్నాయి. ఇక షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్ కింద సరు గుడు, జామాయిల్ 15వందల ఎకరాల్లో ఉన్నాయి. జామాయిల్ చెట్లను సముద్ర తీర ప్రాంతానికి రక్షణగా పెంచుతున్నాం. జిల్లాలో అద్దంకి, కూకట్లపల్లి, గొర్రెపాడు, ముక్తేశ్వరం, నాగరాజుపల్లె 1700ఎకరాల అటవీ భూల్లో జామాయిల్ తోటలు ఉన్నాయి. అటవీ శాఖ అడవులను అభివృద్ధి చేసేందుకు బాపట్ల ముత్తాయ్యపాలెం, వేటపాలెం మండలం రామన్నపేట వద్ద నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాము. అవసరమైన వారికి నామమాత్రపు ధరకు అందజేస్తున్నాం. ఔషధ గుణాలు కలిగిన మర్రి, రావి, వేప వంటి మొక్కలతోపాటు ఇతర చెట్లను పెంచి భావితరాలను


నర్సరీలో పెంచుతున్న ఔషద మొక్కలు

కాలుష్య కోరల నుండి కాపాడేందుకు నేటి యువత ప్రతిన బూనాలి.

మడ అడవులతో ప్రకృతి విపత్తులకు రక్షణ

సముద్ర తీర ప్రాంతంలో మడ అటవీ ప్రాంతం తుఫాన్లు వంటి ప్రకృతి విపత్తుల నుండి ప్రజలకు రక్షణగా నిలుస్తాయి. మడ చెట్లు జీవవైవిద్యానికి ఎంతో మేలు చేస్తాయి. సముద్రపు ఆటు పోట్లకు భూమి ఉపరితలంపై చేరిన చేపలు చెట్ల వేర్లు వద్ద గుడ్లు పెడతాయి. సూర్యరశ్మికి ఆ గుడ్లు పొదిగి చేపపిల్లలు పెరిగి మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తున్నాయి. సముద్ర తీరం కోతకు గురి కాకుండా కాపాడతాయి. ఇటీవల పర్యటకంగానూ మడ అడవులు ప్రసిద్ధి పొందాయి. రేపల్లె రేంజ్ పరిధిలో ముత్తాయపాలెం, ఏ – బి, పెద పులుగు వారిపాలెం, నిజాంపట్నం, దిండి, అడవలదీవి, పేర్లవారిపాలెం, పుల్లరిపాలెం, మోటుపల్లి ఉండగా చీరాల అటవీఅరేంజ్ పరిధిలో అద్దంకి కూకట్లపల్లి, గొర్రెపాడు, ముక్తేశ్వరం, నాగరాజుపల్లె ఉన్నాయి.

పర్యాటక ప్రాంతాల్లో నగరవనం

జిల్లాలో పట్టణాలకు, నగరాలకు దగ్గర్లో నగరవనాలు ఏర్పాటు చేస్తున్నాం. పర్యాటక ప్రాంతమైన బాపట్ల సూర్యలంక, చీరాల వాడరేవు మార్గాల్లో నగర వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. ఇప్పటికే చీరాల వాడరేవు మార్గంలో నగరవనాన్ని ఏర్పాటు చేశాం. కాలినడక మార్గాలు, నక్షత్రవనం, రాశివనం, పంచవడ్డీ నవగ్రహ వనం వంటి మొక్కలను ఈ నగరవణాల్లో పెంచుతున్నాం. పర్యావరణం, పచ్చదనం పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఈ నగరవణాలను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నాం. పర్యావరణహిత ఎకో టూరిజం గ్రీనరీని ప్రోత్సహించడంలో భాగంగా నగర వనాలను ఏర్పాటు చేస్తున్నాం. నేటిమొక్కలే రేపటి మహావృక్ష సంపద. వాటి ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాల్సిన అవసరం ఉంది.

గ్రామకంఠం ఆక్రమణ

అధికారుల మొద్దు నిద్ర

ప్రజాశక్తి - అద్దంకి

పేదలు ప్రభుత్వ స్థలంలో చిన్నపాటి గుడిసె వేసుకుంటే ఆగ మేఘాల మీద అధికార యంత్రాంగం అక్కడ వాలిపో తుంది. వారిని తొలగించే వరకు నిద్ర పట్టదు. అటువంటిది మండలంలో అనేక గ్రామాలలో యదేచ్ఛగా ప్రభుత్వ స్థలా లను ఆక్రమించి నివాసాలు ఏర్పర్చుకుం టుంటే అధికార యంత్రాంగం గాఢ నిద్రలో ఉండి పోతున్నారు. అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. మండలంలోని చిన్నకట్టపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 204లో ఉన్న 60 సెంట్ల గ్రామ కంఠం భూమి ఉంది. దీనిలో ప్రజా సౌకర్యా ర్థం 30సెంట్లు లో సచివాలయ భవన, హెల్త్ కేర్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణం చేశారు. మిగిలిన 30సెంట్ల స్థలంలో గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా రేకుల షెడ్లు నిర్మాణాలు చేస్తున్నారు. ఇటీవల గ్రామా నికి చెందిన కొందరు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురౌతుందని రాతపూర్వ కంగా రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు స్పందించలేదు. దీంతో ఆక్రమణలను ఆపే పరిస్థితి లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికా రులు జోక్యం చేసుకుని ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ఆక్రమణకు గురౌతున్న గ్రామకంఠం భూమి


లక్ష్మీశక్తి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న నక్కా ఆనందబాబు

టిడిపి నాయకురాలు లక్ష్మిశక్తి మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

టిడిపి నాయకురాలు పరుచూరి లక్ష్మిశక్తి కుమారి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈమె వేమూరు ఎఎంసి మాజీ డైరెక్టర్ జొన్నలగడ్డ విజయబాబుకు చిన్నమ్మ అవుతారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

బాపట్ల సిఐగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పి కృష్ణయ్య నరసరావుపేట రూరల్ సర్కిల్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. గుంటూరు విఆర్‌లో ఉన్న శ్రీనివా సరావుకు బాపట్ల పట్టణ సిఐగా పోస్టింగ్ ఇచ్చినట్లు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.


సిఐ శ్రీనివాసరావు

డాక్టర్ ఖాజావలి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -కనిగిరి

డాక్టర్ షేక్ ఖాజావలి మూడవ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయనకు ఘన నివాళి అర్పించారు. వారు చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన జ్ఞాపకార్థం వారి కుమారుడు ఖాజా హుస్సేన్, మనవళ్లు సమీర్ హుస్సేన్, తన్వీర్, అల్లుళ్ళు మస్తాన్ షరీఫ్, ఖాజావలి కనిగిరి పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కలు నాటడం, ఏపీ మోడల్ స్కూల్ 31 మంది విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు పంపిణీ, మజ్జిగ పంపిణీ, స్థానిక మదరసాలోని బాలలకు, వాసవి వద్ధాశ్రమములో వద్ధులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో తమ బావ డాక్టర్ షేక్ ఖాజావలి (బాషా)గ్రామీణ వైద్యులుగా ఎంతో మందికి వైద్య సేవలు అందించారని, కరోనా కష్టకాలంలో కూడా నిరుపేదలకు పేద కళాకారులకు అన్నదానము, నిత్యవసర వస్తువులు పంపిణీ చేసారని అన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కళాకారులు, కనిగిరి మున్సిపాలిటీ కో ఆప్షన్ మెంబెర్ గూడూరి లింకన్, బొట్టు శ్రీను, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ చెన్నారావు, మోడల్ స్కూల్ సిబ్బంది రవి, మదర్ సేవా సమితి అధ్యక్షులు నాయబ్ రసూల్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్ బాబు, కోలా యోహోను, అబ్దుల్ జలీల్ అభిబ్, షరీఫుద్దీన్, షాహిద్, ఖాజా రసూల్, సోహైల్(బన్నీ), అబ్దుల్, రాజకుమార్, చిన్నిగారి కొండలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సమావేశం

ప్రకాశక్తి-మార్కాపురంరూరల్

కాంగ్రెస్ మార్కాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక ప్రెస్ క్లబ్ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యులు షేక్ సైదా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకర్ రెడ్డి పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం , పార్టీ బలోపేతం, గ్రామ, బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం పై చర్చించడం జరుగుతుందని, నూతన మండల పార్టీ కమిటీలు ఏర్పాటు జరుగుతుందని సైదా అన్నారు.

చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే దమ్ములేదు

- రాష్ట్రంలో దొంగ ఓట్లు టిడిపి చేర్పించినవే
- ఐటీ విచారణలో చంద్రబాబు అక్రమాలు తేలుతాయి
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్లీ జగన్‌దే విజయం
- టిటిడి మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి



ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

చంద్రబాబుకు ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసి గెలిచే దమ్ము, ధైర్యం లేదని, అందుకే ఆయన వివిధ పార్టీల పొత్తుల కోసం పాకులాడుతున్నాడని, ఒంగోలు మాజీ ఎంపీ, టిటిడి మాజీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. ఒంగోలులోని శ్రీకృష్ణ మందిరాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు ఎప్పుడూ ఎన్నికల్లో ఎవరో ఒకరి మద్దతుతో, సాయంతో గెలిచిన చరిత్రే రాష్ట్రంలో ఉందన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు బిజెపిని రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వని మాట్లాడిన చంద్రబాబు, నేడు అదే పార్టీతో సఖ్యత కోసం పాకులాడు తున్నాడని తెలిపారు. ఎన్నికలు ముందస్తుగా వచ్చినా, షెడ్యూల్ ప్రకారం వచ్చినా రాష్ట్రంలో గెలుపు మళ్లీ వైసిపిదేనని ఆయన స్పష్టం చేశారు. నాలుగున్నరేళ్ల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు పట్ల ప్రజలంతా తృపిగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో దొంగ ఓట్లుకు కారకులు టిడిపి నాయకులేనని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు ఆపార్టీ అధికారంలో ఉన్నప్పుడు వివిధ నియోజకవర్గాల్లో దొంగ ఓట్లను భారీగా చేర్చారని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 5వేల నుంచి పది వేల వరకు, కొన్ని నియోజకవర్గాల్లో 20వేల వరకు దొంగ ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఇతర ప్రాంతాల వారు, ఇతర రాష్ట్రాల వారిని కూడా ఓటర్లుగా చేర్చినట్లు తెలిపారు. వీటన్నింటిపైనా ఆధారాలతో సహా తమ పార్టీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు అందజేశారని వివరించారు. దొంగ ఓట్లు తొలగించే వరకు తమ పార్టీ పోరాడు తోందన్నారు. దొంగ ఓట్ల ద్వారా లబ్ధిపొందాలనే చంద్రబాబు కుట్రలు సాగనివ్వమని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో అవినీతి విపరీతంగా జరిగిందని, రాష్ట్రాన్ని దోచేశారని ఆరోపించారు. అందుకే చంద్రబాబుకు ఇన్‌కం టాక్స్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. చట్టానికి, కోర్టులకు ఎవరూ అతీతులు కాదని, చంద్రబాబు అవినీతి, అక్రమాలు నిదానంగా నిగ్గుతేలుతాయన్నారు. రాష్ట్రంలో ఎవరైనా పాదయాత్ర చేసేకునే హక్కు ఉందని, అయితే లోకేష్ పాదయాత్ర కేవలం ప్రజలను రెచ్చగొట్టేలా, శాంతి భద్రతల సమస్య సృష్టించేలా సాగుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరైంది కాదన్నారు. సమస్యలపై స్పందించే తీరు సక్రమంగా ఉండాలని హితవు పలికారు.

దాచూరి మెడికల్ క్యాంపులో..

1372 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలకు ఒకసారి నిర్వహించే రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని డిఆర్ఆర్ఎం మున్సిపల్ పాఠశాల ప్రాంగణంలో జరిగింది. బిపి, షుగర్, పక్షవాతం రోగులను పరీక్షించి రూ.200కే రెండు నెలలకు సరిఫడా మందులు, తక్కువ ధరకే ఇన్సులిన్ అందజేశారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపాళం శివన్నారాయణ, డాక్టర్ బి. హరిబాబు, డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ ఎల్.జాన్ రిచర్డ్స్,డాక్టర్ ఎం.సందీప్ ప్రకాష్, డాక్టర్ శరత్ వైద్య సేవలందించారు. రెగ్యులర్‌గా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపుకు చీమకుర్తికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ జవహర్ రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకట్రావు మాట్లాడుతూ వైద్యం వ్యాపారం అయ్యి, నిరుపేదలకు వైద్యం దూరమవుతున్న నేపథ్యంలో గత 8సంవత్సరాలుగా క్రమం తప్పకుండా దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఒంగోలులో మెడికల్ క్యాంపు నిర్వహి స్తున్నామని తెలిపారు. వైద్యశిబిరంలో 1372 మందికి వైద్య సేవలు పొందినట్లు తెలిపారు. వైద్యశిబిరంలో సేవలందించిన డాక్టర్లు, వివిధ విభా గాలలో సేవలందించిన వాలంటీర్లు, ఎన్‌సిసి విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులకు, ఆర్థిక సాయం అందించిన డాక్టర్ జవహర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



వైద్య శిబిరానికి హాజరైన రోగులు

ఆరోగ్య మిత్రలకు అన్ని విధాలా న్యాయం : మంత్రి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు మండల ఆరోగ్య మిత్రలు దర్శనం రాంబాబు, మందగిరి చంద్రశేఖర్ ఆదివారం వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి సురేష్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్రల క్యాడరు, జీతాల పెంపు గురించి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వారితో మాట్లాడినట్లు చెప్పారు. అన్ని విధాలుగా న్యాయం చేస్తామని తెలిపారు.

సమరభేరి బహిరంగ సభ వాయిదా

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విదానాలకు నిరసనగా చీమకుర్తి నుంచి ప్రారంభమైన సమరభేరి ప్రచారజాత ముగింపు సందర్బంగా మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో ఆదివారం నిర్వహించాల్సిన సమరభేరి బహిరంగ సభ వర్షం కారణంగా వాయిదా వేసినట్లు సిపిఎం మండల కార్యదర్శి టి. శ్రీకాంత్ తెలిపారు. మళ్లీ సభ ఎప్పుడు నిర్వహించేది జిల్లా కమిటీతో చర్చించి తేది నిర్ణయిస్తామని ఆయన తెలిపారు.

ఓట్ల తొలగింపులో జాగ్రత్తలు తీసుకోవాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

కుటుంబంలో మరణించిన వ్యక్తి ఓటు తొలగించాలంటే ఆ కుటుంబంలోని వ్యక్తి సంతకం, మరణ ధ్రువీకరణ పత్రం తీసుకొని తొలగించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శింగరాయ ఽకొండ మండలం మూలగుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని పొనుగోటివారి పాలెం, జరుగుమల్లి మండలం కె. బిట్రగుంట గ్రామాల్లో బిఎల్ఒల పని తీరును ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత కె. బిట్రగుంట గ్రామంలో బిఎల్‌లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. బిఎల్ఒలతో మాట్లాడుతూ ఓట్లు తొలగింపు ప్రక్రియ, మరణించిన వ్యక్తుల ఓట్ల తొలగింపు గురించి చర్చించారు. అనంతరం మూలగుంటపాడు పంచాయతీలోని పొనుగోటివారిపాలెం మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఓటు తొలగింపు గురించి బిఎల్ఒలు విచారణ చేశారా లేదా అని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శింగరాయకొండ తహశీల్దారు ఉష , జరుగుమల్లి తహశీల్దారు ఉషారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తన్నీరు తిరుమల రావు,సుజాత, ఎఎస్ఒ సుబ్రహ్మణ్యం, కె. నవీన్ పాల్గొన్నారు. **టంగుటూరు :** బూత్ లెవెల్ అధికారులు ఓటరు దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించిన తరువాతనే సవరణలు చేపట్టాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ కె శ్రీనివాసులు ఆదేశించారు. మండలంలోని వల్లూరు గ్రామంలో నివాసాలకు వెళ్లి దరఖాస్తులపై వారి కుటుంబ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు తొలగింపుల మార్పులు, చేర్పులపై గ్రామస్తుల నుంచి వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. మరణాల ఓటర్లు తొలగింపులు ఉంటే సదరు కుటుంబ సభ్యులు అనుమతి మేరకు మాత్రమే తొలగింపులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కొల్లిబోయిన సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి కె స్వర్ణకుమార్, నాయకులు కుందం హనుమారెడ్డి, కుందం శ్రీనివాసులు రెడ్డి, కూరపాటి విష్ణువర్ధన్ రెడ్డి, సనగర కోటి,. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మృతుల ఓట్లపై విచారణ జరుపుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

నిరుద్యోగ సమస్య పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల విమర్శ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నిరుద్యోగ సమస్య పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యపై స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడిచిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోడీ వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయకుండా, ఉద్యోగాలు భర్తీ చేయకుండా మాట తప్పారని విమర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఇస్తామని, మెగా డిఎస్‌సి ప్రకటిస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎలాంటి జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని, మెగా డిఎస్‌సి ఊసే లేదని తెలిపారు. లక్షలాది మంది యువత చదువులు పూర్తి చేసుకొని ఉద్యోగాలు లేక, ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు. యువతను మద్యం, డ్రగ్స్‌కు బానిసలు చేసేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ కార్యదర్శి మారెళ్ల సుబ్బారావు, పెన్షనర్ల అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు శేషయ్య,సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్, కెవిపిఎస్ జిల్లా నాయకులు అత్తింటి శ్రీనివాసరావు, ఆవాస్ జిల్లా నాయకులు ఎస్‌డి.హుస్సేన్, డివైఎఫ్ఐ నాయకుడు వి. కార్తీక్, ఎస్ఎఫ్ఐ నాయకులు టి ప్రవీణ్, వెంకటేష్, వీం స్వామి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు